పల్లెల్లో దాహం..దాహం!





చిలకలడోణలో తాగునీటి కోసం తోపుడు బండ్లతో కుళాయి వద్దకు వెళ్తున్న చిన్నారులు, కోసిగి మండలం పల్లెపాడులో కుళాయి వద్ద బారులు తీరిన జనం

- పల్లె వాసుల కన్నీటి పాట్లు
- పొలాల వైపు పరుగులు పెడుతున్న జనం



☛ నీటి సమస్యను వివరిస్తున్న ఈయన పేరు శేఖన్న, చిలకలడోణ గ్రామం. నీటి సమస్య తీవ్రతను వివరిస్తూ..'' మా ఊరికి మంత్రాలయం ఎస్‌ఏపీ స్కీం నుంచి నీళ్లు ఇచ్చేవాళ్లు. ప్రస్తుతం 5 రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి. కుళాయిలకు నీళ్లు వస్తే కొందరు మోటార్లు వేసుకుంటున్నారు. దీంతో మా గేరికి నీళ్లే రావడం లేదు. దీంతో పైగేరిలోని కుళాయిల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. ఏళ్లుగా ఇదే సమస్య ఉంది. నదిలో నీళ్లు అయిపోతే మా తిప్పలు వర్ణనాతీతం'' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు..



☛ ఈమె పేరు లక్ష్మి.. చిలకలడోణ గ్రామం. నీటి సమస్యపై ఆమె మాట్లాడుతూ..'' పనులన్నీ మానేసి నీళ్ల కోసమే ఇంటి కాడ ఉండాల్సి వస్తోంది. మా ఊరికి ఎప్పుడు నీళ్లొస్తాయో కూడా అర్థం కావడం లేదు. ఏ నాయకుడు మా సమస్యను పట్టించుకోవడం లేదు. మా ఊరిలో సగానికి పైగా జనాలు ఇళ్ల వద్దే ఉండాల్సి వస్తోంది. నీళ్లు దొరికితే అదే ప్రసాదం అన్నట్లుంది మా పరిస్థితి'' అంటూ వాపోయింది.

మంత్రాలయం : గొంతు తడుపుకునేందుకు పల్లె జనం పడరాని పాట్లు పడుతున్నారు. రేయింబవళ్లు తాగు నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. పిల్లలు మొదలు పెద్దల వరకు ఇవే కష్టాలు. కొన్ని గ్రామాల్లో కుళాయిల వద్ద నీటి కోసం నిరీక్షిస్తుండగా, మరికొన్ని ఊళ్ల పారు గూళ్లకు, పొలాల్లోని వ్యవసాయ బోర్ల నీటి కోసం పరుగులు తీస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది.

పడకేసిన పథకాలు..

నియోజకవర్గంలో మొత్తం 11 సీడబ్ల్యూసీ పథకాలు ఉండగా అందులో అన్ని పథకాలు కూడా తూతూ మంత్రంగా పనిచేస్తున్నాయి. మంత్రాలయం ఎస్‌ఏపీ స్కీం నుంచి గతంలో 11 గ్రామాలకు తాగు నీరు ఇస్తుండగా ప్రస్తుతం 5 గ్రామాలకు కూడా నీరివ్వడం లేదు. అందులో చిలకలడోణ, కల్లుదేవకుంట, చెట్నెహళ్లి గ్రామాల్లో సగం ప్రాంతాలకు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. కోసిగిలోని సాతనూరు ఎస్‌ఏపీ స్కీం నుంచి 9 గ్రామాలకు తాగునీరు ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం 6 గ్రామాలకు కూడా సరఫరా కావడంతో లేదు. కౌతాళం మండలంలో హాల్వి ఎస్‌ఏపీ నుంచి 10 గ్రామాలకు నీరు పంపిణీ చేయాల్సి ఉండగా 7 గ్రామాలకు కూడా సక్రమంగా పంపిణీ కావడం లేదు. హాల్వి ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించి 7 ఏళ్లు గడిచినా చుక్క నీరు పంపింగ్ చేయలేదు. కౌతాళం ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి 10 రోజులకోసారి నీటిని ఇస్తున్నారు. సూగూరు ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి అరకొరగా తాగునీరు ఇస్తున్నారు. కుంటనహాల్, రౌడూరు ఎస్ ఎస్ ట్యాంకులు తుంగభద్ర దిగువ కాలువ నీటిపై ఆధారపడి పనిచేస్తున్నాయి. ట్యాంకుల నిర్వహణ లోపంతో లీకేజీలు ఏర్పడి పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. వేసవి వచ్చిందంటే ఆయా గ్రామాల ప్రజలు కుళాయిల వద్ద ముష్టియుద్ధాలకు దిగుతున్నారు.



నీటి సమస్య పరిష్కరించాలని కోసం కౌతాళంలోని దూదేకుల గేరి మహిళల ఆందోళన

తాగునీటికి కట కట..

మంత్రాలయం మండలంలోని చిలకలడోణ, కల్లు దేవకుంట, చెట్నెహళ్లి, మాధవరం గ్రామాల ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నాయి. కల్లుదేవకుంట వాసులు 4 కి.మీ. దూరంలోని ఇబ్రహీంపురం గ్రామానికి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. చెట్నెహళ్లి వాసులు వాటర్ ప్లాంట్ల నుంచి నీరు కొని దాహం తీర్చుకుంటున్నారు. కౌతాళం మండలంలోని రౌడూరు, ఉరకుంద, కుంబళనూరు, అగసలదిన్నె, డంబలదిన్నె, పొదలకుంట, కౌతాళం, మదిరె గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. హాల్వి ఎస్‌ఏపీ స్కీం పరిధిలోని గ్రామాలకు 10 రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. కోసిగి మండలంలో సాతనూరు ఎస్‌ఏపీ, బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. మండలంలోని అర్లబండ, దుద్ది, పల్లెపాడు, చింతకుంట, కామన్‌దొడ్డి, కందకూరు, జంపాపురం, జుమ్మాలదిన్నె తదితర గ్రామాల ప్రజలకు తాగునీటి కోసం పొలాల్లో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో నీటిని బిందెల్లో తెచ్చుకునేందుకు ప్రత్యేక తోపుడు బండ్లు చేయించుకున్నారు.

నియోజకవర్గం : మంత్రాలయం	
మండలాలు : మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు	
గ్రామాలు :	111
జనాభా :	2,89,734
తాగునీటి పథకాలు :	
సీడబ్ల్యూసీ :	11
పీడబ్ల్యూసీ :	133
జీఎస్‌ఎల్‌ఆర్ ట్యాంకులు :	58
ఓహెచ్‌ఆర్ ట్యాంకులు :	96
కుళాయి కనెక్షన్లు :	24,856

క్లుప్తంగా

'సప్తతి' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త, బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 70వ పుస్తకం 'సప్తతి' పుస్తకావిష్కరణ శుక్రవారం వేడుకగా జరిగింది. ఆయన తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం ఆచార్య డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు, శతాధిక పుస్తకాల ప్రచురణ కర్త డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్‌రాజు తదితరులు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పుస్తకాన్ని ఆవిష్కరణ గావించారు. అనంతరం పుస్తకాన్ని కేవి నాగేశ్వరయ్యకు అంకితమిచ్చారు. గద్వాల సోమన్నను సాహిత్యమిత్రులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఆలయంలో చోరీ

నందవరం : మండలంలోని ఇబ్రహీంపురం కొట్టాల గ్రామంలో శ్రీరాముడి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళం పగులగొట్టి శ్రీ రాముడి 4 వెండి కిరీటాలు, వెండి హారం రూ.50 వేల విలువ జేసే వెండి అభరణాలను తస్కరించారు. అటు వైపుగా వస్తున్న ఉపాధి కూలీలు గమనించి ఆలయంలోకి వెళ్లి చూడగా చోరీ జరిగిందని భావించి ఆలయ ధర్మకర్త వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం ఆయన నందవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ కోదండరామిరెడ్డి తెలిపారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన



భోజనం రుచిపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయం పేదలకు వడ్డించే అల్పాహారం నాణ్యతపై పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌లో వడ్డించే అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా తయారు చేయాలలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫిల్టర్ బెడ్ల పరిశీలన



ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మంచినీటిని సరఫరా చేసే గుడికల్ రోడ్డులోని ఫిల్టర్ బెడ్లను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. నీటిని సక్రమంగా, క్రమం తప్పకుండా శుద్ధి చేసి పంపింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని శిల్పా కాలనీ, పార్క్ రోడ్, ఆదోని రోడ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఆధార్ ప్రక్రియ పూర్తి చేసుకోండి

ఆదోని టౌన్: ఆధార్ లింక్ ప్రక్రియను ఈనెలాఖరులోపు పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆధార్ లింకు కాని వారు, ఆధార్ నమోదు, జనన సర్టిఫికెట్లు పొందని వారు ఈనెలాఖరిలోగా నమోదు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాలన్నారు. సర్వే ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయని సచివాలయ ఉద్యోగులకు వేతనాలను నిలిపేస్తామన్నారు. వీధి వ్యాపారుల పూర్తి వివరాలు సర్వే నిర్వహించాలన్నారు. 3వ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు గానూ చలివేంద్రాల ఏర్పాటు, వడదెబ్బకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

6 నుంచి శిక్షణా తరగతులు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో జూలై 6 నుంచి 8వ తేదీ వరకు సాయి కుల్వంత్ హాల్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సేవా ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, మానవతా విలువలపై మూడు రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్యసాయి విద్యా సంస్థల విద్యార్థులు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 18 - 25 సంవత్సరాల వయసు గల బాల వికాస్ పూర్వ విద్యార్థులు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ యువతీ యువకులు సమ్మర్‌క్యాంప్‌లో పాల్గొనవచ్చని సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనాలనుకునే వారు జూన్ 18వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)ల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా సులభతరమైన మాన్యువల్‌గా నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్రయాదవ్, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ లోక్యనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించడంతోపాటు అర్హత ఉన్న ఎస్జీటీలకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రహ్లాద, భీమరాజు, మార్య, విజయ్, శ్రీనివాసులు, గంగనాయక్ పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కోసిగిలో ర్యాలీ చేపట్టిన వైద్యులు, సిబ్బంది

కోసిగి: డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రజిత, మౌనిక తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సామాజిక ఆరోగ్య అధికారిణి పి.ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కల్లుదేవకుంట గ్రామంలో ర్యాలీ

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం : డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి గోవిందమ్మ సూచించారు. శుక్రవారం కల్లుదేవ కుంట గ్రామంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీహెచ్ఓ వెంకటలక్ష్మీ, సూపర్ వైజర్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగిన శిక్షణ తరగతులు

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లాస్థాయి శిక్షణ తరగతులు పట్టణంలో శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కళల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, పట్టణ మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య



గోనెగండ్ల ఆస్పత్రి ఎదురుగా వేసిన చెత్త చెదారం

చెత్త 'శుద్ధి' ఏదీ?

- గోనెగండ్ల ఆస్పత్రి ఎదుట చెత్త చెదారం
- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు

గోనెగండ్ల : ఆరోగ్యం మాట దేవుడెరుగు ఆ ఆస్పత్రికి వెళ్తే ముందుగా చెత్త చెదారమే దర్శనమిస్తుంది. దీంతో లేని రోగాలంటుకుంటాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ముందు ప్రాంతం చెత్తకుప్పను తలపిస్తోంది. ఆస్పత్రి గేట్ ముందు చెత్త వేయడం, కంపౌండ్ వాలుకు అనుకొని మూత్ర విసర్జన చేస్తుండటంతో ప్రధాన గేట్ నుంచే దుర్గంధం ప్రారంభమవుతుందని ఆస్పత్రికి వెళ్లే ప్రజలు వాపోతున్నారు. ఆ చుట్టు పక్కల దుకాణదారులు చెత్తను గేట్ ముందు వేస్తున్నారు. అధికారులు మనం-మన పరిశుభ్రత, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అంటూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, ఊదరగొడుతున్న ప్రసంగాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పరిసరాల శుభ్రతలో భాగంగా కేవలం ఫొటోలకే పరిమితమవుతుండటంతో శుభ్రతను గాలికొదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోగులు ఇబ్బందులు పడుతున్నారు



ఆస్పత్రి వద్ద అపరిశుభ్రంగా ఉంటోందిన రోగాలను నయం చేయించుకోవడానికి వస్తే.. ఈ వాతావరణంతో కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆసుపత్రి గేట్ ముందే చెత్త వేయడం, కంపౌండ్‌వాల్ దగ్గర మూత్ర విసర్జన చేయడంతో పరిసరాల్లో ముక్కుకు గుడ్డ తీయలేం. అలాగే ఆస్పత్రిలోకి అంబులెన్స్ రావడానికి చాలా ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ ఆస్పత్రి లోపలికి రావాలంటే అక్కడ ఏర్పాటు చేసుకున్న బంకులతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– తాయప్ప, గోనెగండ్ల

జాగ్రత్తలతో టీబీ నయం

– డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి



క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి

ఆదోని టౌన్: తగిన జాగ్రత్తలు పాటిస్తే టీబీ నయం చేసుకోవచ్చని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి తెలిపారు. స్థానిక టీబీ యూనిట్‌లో 20 మంది పేద క్షయవ్యాధిగ్రస్తులకు పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.మహమ్మద్ ఫయాజుద్దీన్, నిరంజన్‌కుమార్‌ల సహకారంతో రూ.1,000 విలువ చేసే పోషకాహార కిట్లను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. వైద్యుల సూచన మేరకు సక్రమంగా మందులను వాడుతూ, మంచి పోషకాహారం తీసుకుంటే జబ్బు నుంచి బయట పడొచ్చని ఆమె రోగులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బాబురాజు, జిల్లా పబ్లిక్, ప్రైవేట్ కో ఆర్డినేటర్ ఉమాపతి పాల్గొన్నారు.

ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. శుక్రవారం పట్టణంలోని రూ.7లక్షలతో పూడికతీత పనులను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని అన్ని డ్రైన్లలో పూడికతీత పనులను 25 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. మున్సిపల్ డీఈ రాజునాయక్, ఏఈ మదన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

ఆదోని రూరల్: దళిత కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్)మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని సంతెకూడ్లూరు సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గ్రామ కమిటీ సభ్యులు గాది, వీరేష్, ఏలియా,ఉరుకుంద, భీమేష్, సిద్ధ, కృష్ణపాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలో శనివారం వ్యవసాయానికి 3 ఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాధవరం 132కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత గొడవలతో ఇంటికి నిప్పు

ఆదోని అర్బన్: వ్యక్తిగత గొడవలతో ఓ వ్యక్తి ఏకంగా ఎదురింటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన పట్టణంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన వివరాలివీ.. స్థానిక అరుంజ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న శాంతరాజ్ హమాలీ. ఇతని ఎదురింట్లో ఉంటున్న కిరణ్ ఎలాంటి పని చేయకుండా తిరుగుతుంటాడని స్థానికులు తెలిపారు. అయితే శాంతరాజ్ ఇంటి ముందు కూర్చుంటే, ఓర్వలేని కిరణ్ గతంలో రెండుసార్లు గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెల్లవారుజామున శాంతరాజ్ ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు తేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనలో తమకు చిన్న గాయాలయ్యాయని, ఇంటి సామాగ్రి కాలిపోయిందని శాంతరాజ్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

ఆదోని టౌన్: పట్టణంలోని రాంజల పంప్‌హౌస్ సమీపంలో ఎనిమిల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం తెలిపారు. వీధి కుక్కల జనాభాను మానవీయంగా, సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంతో మున్సిపాలిటీలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రామ్‌ను చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథి హాజరవుతారన్నారు.

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రాముడిని పరామర్శిస్తున్న సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న స్థానిక మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కురువ రాముడిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శుక్రవారం రాత్రి ఉరుములు,మెరుపులు వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి 8గంటలకు ఉరుములతో వర్షం మొదలవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉరుముల శబ్దాలకు ప్రజలు భయాందోళన చెందారు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వర్షం తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పత్తి విక్రయాలపై విజిలెన్స్ విచారణ



రైతులను విచారిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ విశ్వనాథ్

ఆలూరు: నియోజకవర్గంలో సీసీఐకి పత్తి పంటను విక్రయించిన రైతులను జిల్లా సీసీఐ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ విశ్వనాథ్ విచారించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆలూరు మండలంలోని కమ్మరచేడు, మనేకుర్తి, మూసానపల్లి, అరికెర కురుకుంద గ్రామాలకు చెందిన రైతులను విచారించారు. గత ఖరీఫ్ సీజనల్లో పత్తి పంట సాగుచేసి ఆయా గ్రామాల రైతులు ఈ-క్రాప్ బుక్కింగ్ కూడా చేయించుకున్నారు. అయితే గత నెలలో సీసీఐకి దిగుబడిని విక్రయించారు. విక్రయాలకు మధ్య దళారులు ఉన్నారా? నకిలీ రైతులా? ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశారు తదితర అంశాలపై ఏఓ వెంకటేష్ గౌడ్‌తో కలిసి విచారణ చేశారు. అయితే గుట్టుగా విచారణ చేయడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

బండలాగుడు విజేత డోన్ వృషభాలు



బండ లాగుడుతున్న వృషభాలు

అవుకు: పట్టణంలో చెన్నకేశవస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా అవుకు జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. డోన్‌కు చెందిన సుబ్బారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. ద్వితీయ బహుమతి అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు వృషభాలు, తృతీయ బహుమతి నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన రాంభూపాల్ వృషభాలు, నాల్గో బహుమతి అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రమేష్ బాబు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గుర్విరెడ్డి వృషభాలు, ఐదో బహుమతి నంద్యాల జిల్లా హుసేనాపురానికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు, ఆరో బహుమతి చౌటపల్లెకు చెందిన మార్థల చంద్ర ఓబుల్ రెడ్డి వృషభాలు గెలుపొందాయి. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

ఎమ్మిగనూరుటౌన్: గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ కమిషనర్ 30 సమావేశాలు నిర్వహించినప్పటికీ సంఘాలు అభ్యంతం వ్యక్తం చేసిన అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడంతో ఆయా సమస్యల సాధనకు పోరాటం చేయకతప్పడం లేదని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుతో పాటు ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా గుర్తించిన స్కూల్ అసిస్టెంట్‌లను ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్టుగా 1:45 గా నిర్ణయించి నియమించాలని సూచించారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతులివ్వాలని, ఉపాధ్యాయ బదిలీల్లో పోస్టులను అన్ని పోస్టులను చూపించాలని కోరారు. రేషనలైజేషన్‌కు ఏప్రిల్ 23వ తేదీని పరిగణలోకి తీసుకోవాలన్న తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఐక్య వేదిక ద్వారా ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com